క్లుప్తంగా

ఉపాధ్యాయులుగా ఎంపికైన అభ్యర్థులూ రారండి!

తిరుపతి సిటీ: ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని మెగా డీఎస్సీ– 2025లో ఎంపికైన అభ్యర్థులందరూ సెప్టెంబర్ 24వ తేదీ ఉదయం 7 గంటలకు తిరుపతి నగరం రేణిగుంట రోడ్డులోని చదలవాడ ఇంజినీరింగ్ కాలేజీకి తప్పనిసరిగా రావాలని డీఈఓ కేవీఎస్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు కాల్ లెటర్, ఆధార్ కార్డుతో రిపోర్టు చేయాలన్నారు. 25వ తేదీన అమరావతి కేంద్రంగా ముఖ్యమంత్రి అపాయింట్‌మెంట్ ఉత్తర్వులు జారీ చేస్తారని, అందుకు గాను ఉమ్మడి జిల్లాలో ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులు హాజరు కావాలని సూచించారు. వర్షాభావ పరిస్థితులుండడంతో గొడుగు వెంట తెచ్చుకోవాలని సూచించారు. అభ్యర్థులు తమ ఫొటోతోపాటు ఐడీ కార్డులు, కాల్‌లెటర్లతో చదలవాడ ఇంజినీరింగ్ కళాశాలకు చేరుకోవాలని, ఉచితంగా బస్సు సౌకర్యం కల్పించడం జరిగిందన్నారు.

తెలుగుగంగ కాలువలో యువకుడి గల్లంతు


శ్రీను (ఫైల్)

కలువాయి(సైదాపురం): ఓ యువకుడు దాహం తీర్చుకోవడానికి తెలుగుగంగ కాలువలోకి దిగి, గల్లంతైన ఘటన కేశమనేనిపల్లిలో జరిగింది. కలువాయి మండలం కేశమనేనిపల్లి గ్రామానికి చెందిన చలకచర్ల శీను (28) కూలీ పనులు చేసుకున్నాడు. దాహం వేయడంతో నీరు తాగేదానికి తెలుగు గంగ కాలువలోకి దిగాడు. ప్రమాదవశాత్తు జారిపడి గల్లంతైనట్టు స్థానికులు తెలిపారు. శ్రీనుకు ముగ్గురు పిల్లలు ఉన్నారు.

శ్రీవారి గొడుగులకు ఘన స్వాగతం

తిరుపతి కల్చరల్: శ్రీవారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం సందర్భంగా స్వామివారికి సమర్పించనున్న గొడుగులు సోమవారం తిరుపతికి చేరుకున్న సందర్భంగా భక్తులు ఘన స్వాగతం పలికారు. చెన్నైకి చెందిన ఫోవైసీ అలిమేలు మంగమ్మ అండ్ ట్రస్టు నిర్వాహకుడు గోపాలకృష్ణ ఆధ్వర్యంలో పాదయాత్రగా తిరుపతిలోని శ్రీకోదండరామాలయం వద్దకు చేరుకున్న 8 శ్రీవారి గొడుగులకు భక్తులు పూజలు చేశారు. అనంతరం గొడుగులు తిరుమలకు తరలించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు పోకల అశోక్‌కుమార్, పసుపులేటి హరిప్రసాద్, రంగస్థలి చైర్మన్ గోపినాథ్ రెడ్డి, పురోహితుడు సురేష్ స్వామి, నవీన రెడ్డి బాబు, హనుమంతరావు, సుబ్బరామయ్య, పొనగంట భాస్కర్ పాల్గొన్నారు.

డిస్టెన్స్ ఎడ్యుకేషన్ కోర్సులకు నోటిఫికేషన్ విడుదల

తిరుపతి రూరల్: శ్రీపద్మావతీ మహిళా యూనివర్సిటీలో సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ (సీడీఓఈ)లో వివిధ యూజీ, పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు వర్సిటీ అధికారులు సోమవారం నోటిఫికేషన్ జారీ చేశారు. బీఈడీ అడిషనల్ మెథడాలజీ, ఎంకామ్, ఎంఏ తెలుగు, ఎంఏ సంగీతం, డిప్లొమా ఇన్ మ్యూజిక్ (సంకీర్తన), వర్ణం, అన్నమయ్య అంతరంగం కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆసక్తి గల వారు ఈనెల 30 లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు www.spmvv.ac.in వెబ్‌సైట్‌ను చూడాలన్నారు.

అక్రమ కేసులు కక్ష సాధింపే



అధికారం చేపట్టిన నాటి నుంచే కూటమి ప్రభుత్వం చేస్తున్న అక్రమాలు, దాడులు ప్రజా వ్యతిరేక విధానాలను ప్రశ్నించే పత్రిక గొంతు నొక్కి అక్రమ కేసులు బనాయించడం కక్ష సాధింపే. ప్రభుత్వం చేస్తున్న అరచాకాలను వెలుగులోకి తెచ్చేలా వార్తలు రాస్తే వారిపై కక్ష సాధింపు చర్యగా పత్రికా స్వేచ్ఛకు భంగం కలిగించేలా వ్యవస్థలను చేతుల్లోకి తీసుకునేలా వ్యవహరించడం, సాక్షి దినపత్రిక ఎడిటర్‌తోపాటు విలేకర్లపై అక్రమ కేసులు పెట్టడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం పాలు చేయడమే.

– జీ శశికుమార్, గూడూరు నియోజకవర్గ కార్యదర్శి, సీపీఐ



కేసులు పెట్టడం బాధాకరం



కూటమి ప్రభుత్వంలో జరుగుతున్న దాడులు, అరచకాలను వెలుగులోకి తీసుకుని వచ్చిన మీడియాపై కేసులు బనాయించడం బాధాకరం. ఇలాంటి వాటిని ప్రతి ఒక్కరూ ఖండించాలి. ప్రజా సంక్షేమ పథకాలు, ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల దృష్టికి తీసుకెళ్లే సాధనం మీడియా. అలాంటి మీడియా ప్రతినిధులపై అక్రమ కేసులు బనాయించి ఇబ్బందులకు గురి చేయడం శోచనీయం.

– సీహెచ్ ప్రభాకర్, వ్యవసాయ కార్మిక సంఘం, తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి

సమస్యలు పరిష్కరించండి

- పీజీఆర్ఎస్‌కు 382 అర్జీలు
- రెవెన్యూ సమస్యలపై 221 అర్జీలు


అర్జీదారులతో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, అధికారులు

తిరుపతి అర్బన్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)కు వచ్చే అర్జీలకు సంబంధించిన సమస్యలను పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ వెల్లడించారు. సోమవారం కలెక్టరేట్‌లో చేపట్టిన పీజీఆర్ఎస్ జేసీ ఆధ్వర్యంలో నిర్వహించారు. 382 అర్జీలు వచ్చాయి. అందులో 221 అర్జీలు రెవెన్యూ సమస్యలు ఉన్నాయి. గ్రీవెన్స్‌కు డీఆర్వో నరసింహులు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు రోజ్‌మాండ్, దేవేంద్రరెడ్డి, సుధారాణి పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద 79 ఏళ్ల వృద్ధుడు దీక్ష

తొట్టంబేడు మండలంలోని శ్రీకృష్ణాపురంలో 79 ఏళ్ల వయస్సు కలిగిన న్యాయం చేయాలని సోమవారం కలెక్టరేట్ వద్ద సద్దికూటమి వీరాస్వామి పూలమాల మెడలో వేసుకుని దీక్ష చేపట్టారు. ఆదే సమయంలో అక్కడే ఉన్న ఏఎస్పీ రవిమనోహరాచారి ఆయన సమస్యను తెలుసుకున్నారు. వెంటనే గ్రీవెన్స్ నిర్వాహకుడు జగదీష్‌ను పిలిపించి...ఆయన సమస్యను తెలుసుకుని పరిష్కరించాలని సూచించారు. దీంతో జగదీష్ తొట్టంబేడు రెవెన్యూ అధికారులతో మాట్లాడారు. వెళ్లి తహసీల్దార్‌ను కలవాలని సూచించారు. అయితే ఆయన తమకు న్యాయం జరగడం లేదంటూ కలెక్టరేట్ ఆవరణంలోనే కూర్చొని ఉండిపోయారు.

తల్లికి వందనం రాలేదు!

తిరుపతి అర్బన్ ప్రాంతానికి చెందిన రెహానా అనే మహిళ తమ పిల్లలు మహ్మద్ ఇంతాన్(8వ తరగతి), దాదషియర్(7వ తరగతి) తల్లికి వందనం రాలేదని వాపోయారు. ఆధార్‌కార్డు మ్యాపింగ్ కాలేదని చెప్పడంతో మ్యాపింగ్ తప్పులను సవరించుకోవడానికి వచ్చానని వెల్లడించారు. తాను పేద కుటుంబానికి చెందిన వారమని, తమ పిల్లలకు తల్లికి వందనం ఇప్పించాలని అధికారులకు ఓ వినతిపత్రం అందజేశారు.

రెండు కాళ్లు పనిచేయడం లేదు

రెండు కాళ్లు పనిచేయడం లేదు, మాటలు సక్రమంగా రావడం లేదని, 90శాతం వికలత్వం ఉన్నా తనకు పింఛన్ ఇవ్వడం లేదని పుత్తూరుకు చెందిన మురగన్‌ను సోమవారం తమ తల్లిదండ్రులు కలెక్టరేట్‌కు తీసుకొచ్చారు. పింఛన్ ఇప్పించాలని అధికారులను కోరారు.

వీఆర్ఏ సమస్యలను ప్రభుత్వం పట్టించుకోదా?

ఏపీ గ్రామ రెవెన్యూ సహాయకులు(వీఆర్ఏ)ల సమస్యలను కూటమి ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోవడం లేదని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్ వద్ద వీఆర్ఏలు ధర్నా చేశారు. వారికి ఏఐటీయూసీ నేతలు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తహసీల్దార్ కార్యాలయంలో ఖాళీగా ఉన్న కంప్యూటర్ ఆపరేటర్లు, అటెండర్లు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే వీఆర్వోల జీతాలు పెంచాలని కోరారు. అనంతరం అధికారులకు వినతిపత్రం అందజేశారు. సీపీఐ నేత జనమాల గురువయ్య, ఏఐటీయూసీ నేత ఎన్‌డీ రవి, సీహెచ్ శివకుమార్, రామకృష్ణ, శ్రీనివాసులు, వీఆర్ఏల సంఘం నేతలు వెంకటేష్, గీత, గణపతి, ప్రేమ్‌కుమార్, రామ్మూర్తి, హరి తదితరులు పాల్గొన్నారు.


కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న వీఆర్ఏలు

కారుణ్య నియామకాలు పూర్తి చేయండి

విద్యుత్ శాఖలో కారుణ్య నియామకాలను పూర్తి చేయాలని ఉద్యోగులు కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. సోమవారం కలెక్టరేట్ వద్ద తిరుపతి విద్యుత్ సర్కిల్ పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగులు ధర్నా చేపట్టారు. వారు మాట్లాడుతూ పాత పద్ధతికి విరుద్ధంగా ఇంక్రిమెంట్లు, మాస్టర్ స్కేల్ రూపొందించడంతో తమకు నష్టం జరుగుతుందని స్పష్టం చేశారు. అనంతరం జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్‌కు వినతిపత్రం అందజేశారు.


కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న విద్యుత్ విభాగం ఉద్యోగులు

దర్భ చాప, తాడు ఊరేగింపు


రంగనాయక మండపంలోని శేషవాహనంపై దర్భ చాప, తాడు


దర్భ చాప, తాడుకు పూజలు చేస్తున్న అధికారులు, పండితులు

తిరుమల: శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో ధ్వజారోహణానికి ఉపయోగించే దర్భచాప, తాడును టీటీడీ అటవీ విభాగం కార్యాలయం నుంచి సోమవారం డీఎఫ్ఓ ఫణికుమార్ నాయుడు, సిబ్బంది ఊరేగింపుగా శ్రీవారి ఆలయానికి తీసుకొచ్చారు. అనంతరం శ్రీవారి ఆలయంలోని రంగనాయకుల మండపంలో శేషవాహనంపై దర్భతో తయారు చేసిన చాప, తాడును ఉంచారు. ఈ నెల 24వ తేదీన సాయంత్రం 5.43 నుంచి 6.15 గంటల మధ్య మీన లగ్నంలో నిర్వహించే ధ్వజారోహణం కార్యక్రమంలో వీటిని ఉపయోగిస్తారు.

ధ్వజారోహణానికి దర్భ చాప, తాడు కీలకం

బ్రహ్మోత్సవాల ఆరంభానికి సూచికగా ధ్వజారోహణం నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ధ్వజస్తంభం పైకి గరుడ పతాకం ఎగురవేసి ముక్కోటి దేవతలను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానిస్తారు. రుత్వికులు వేద మంత్రాలతో దర్భ చాపను ధ్వజస్తంభం చుట్టూ చుడతారు. దర్భతో పేనిన తాడును ధ్వజస్తంభంపై వరకు చుడతారు. వీటి తయారీ కోసం టీటీడీ అటవీ శాఖ 10 రోజుల ముందు నుంచే కసరత్తు చేస్తోంది. దర్భలో శివ దర్భ, విష్ణు దర్భ అనే రెండు రకాలు ఉండగా, తిరుమలలో విష్ణు దర్భను ఉపయోగిస్తారు. ఇందుకోసం ఏర్పేడు మండలం చెల్లూరు గ్రామంలో ఉన్న విష్ణు దర్భను టీటీడీ అటవీ సిబ్బంది సేకరించారు. దీన్ని తిరుమలకు తెచ్చి తక్కువ ఎండలో వారం రోజులు ఎండబెట్టి బాగా శుభ్రపరచి, చాప, తాడు తయారు చేశారు. అటవీశాఖ సిబ్బంది 22 అడుగుల పొడవు, ఏడున్నర అడుగుల వెడల్పుతో 60 కిలోల బరువైన దర్భ చాప, 255 మీటర్ల పొడవైన 106 కిలోల తాడు సిద్ధం చేశారు.

దర్భ వైశిష్ట్యం

వేదోక్త శాస్త్రాల్లో దర్భ (కుశ గడ్డి) అత్యంత పవిత్రమైనదిగా పేర్కొన్నారు. రుగ్వేదంలో ''కుశా పవిత్రా భవతు'' అని దర్భను శుద్ధికరమైనదిగా చెప్పగా, యజుర్వేదంలో దర్భాసనంపై కూర్చొని చేసే ఉపాసన శ్రేష్ఠ ఫలితాలను ఇస్తుందని పేర్కొన్నారు. శాస్త్రీయంగా చూసినా ఇందులో సిలికా అధికంగా ఉండడంతో వాతావరణ శుద్ధి, సూక్ష్మక్రిముల నిర్మూలన జరుగుతుంది. కాబట్టి వేదోక్త కర్మల్లో దర్భ వినియోగం, దైవిక వరమని భావిస్తారు.

సిద్ధేశ్వర గుట్టను పరిశీలించిన మైనింగ్ అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

రామచంద్రాపురం: మండలంలోని సి.రామాపురం సమీపంలో ఉన్న సిద్ధేశ్వర గుట్టలో కొన్ని రోజులుగా జరుగుతున్న అక్రమ గ్రావెల్ మాఫియాపై ఎట్టకేలకు మైనింగ్ అధికారులు స్పందించారు. కొద్ది రోజులుగా శ్రీసిద్ధేశ్వర గుట్టపై అధికార పార్టీకి చెందిన కొందరు అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్నారు. ఈ క్రమంలో సోమవారం సాక్షి దినపత్రికలో 'గుట్టకాయ స్వాహా' అన్న శీర్షిక కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన మైనింగ్ శాఖ అధికారులు సోమవారం సిద్ధేశ్వర గుట్టను పరిశీలించారు. అక్రమంగా తరలుతున్న గ్రావెల్ మాఫియాను అడ్డుకున్నారు. టిప్పర్లపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా అక్కడ నుంచి వెనుదిరిగి వెళ్లినట్లు స్థానికులు చెబుతున్నారు. రూ.కోట్ల విలువైన ఎర్రమట్టిని కూటమి నాయకులు తిరుపతికి తరలించి సొమ్ము చేసుకునే క్రమంలో మండలంలోని గుట్టలు కరిగిపోతున్నాయని స్థానికులు వాపోతున్నారు. దీనిపై స్పందించిన మైనింగ్‌శాఖ అధికారులు సిద్ధేశ్వర గుట్టను పరిశీలించి తాత్కాలికంగా అక్రమ మైనింగ్ పనులను నిలిపివేశారు. కేవలం రాజకీయ ఒత్తిడితోనే సిద్ధేశ్వర గుట్టను నామమాత్రంగా పరిశీలించారని, అక్రమార్కులపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా తవ్వకాలు జరుపుతున్న వాహనాలను సీజ్ చేయకుండా వెనుతిరగడం ఏమిటని స్థానిక ప్రజలు మండిపడుతున్నారు.

సీఎం పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు


మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి అర్బన్: తిరుమల బ్రహ్మోత్సవాల నేపథ్యంలో పట్టువస్త్రాలను సమర్పించడానికి ఈ నెల 24, 25 తేదీల్లో సీఎం చంద్రబాబునాయుడు తిరుమల పర్యటన ఉందని, అందుకు పటిష్టమైన ఏర్పాట్లు చేపట్టాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. సోమవారం ఆయన కలెక్టరేట్‌లో ఎస్పీ సుబ్బరాయుడు, జేసీ శుభం బన్సల్, తిరుపతి కమిషనర్ మౌర్యతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ ఏర్పాట్లలో ఎలాంటి లోపాలకు తావివ్వకూడదని తెలిపారు. మెడికల్ క్యాంపు, అంబులెన్స్ ఏర్పాట్లను జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి సమన్వయం చేసుకోవాలని చెప్పారు. సేఫ్టీ రూమ్ అధునాతన లైఫ్ సపోర్ట్, ఫైర్ సేఫ్టీ, ఫుడ్ సేఫ్టీ, ఏపీ ఎస్పీడీసీఎల్ అధికారులు సమష్టిగా పనిచేయాలన్నారు. శానిటేషన్ ఏర్పాట్లు, కాన్వాయ్ వెహికల్స్ ఏర్పాటు, హెలిపాడ్‌లో భద్రత ఏర్పాట్లు, ప్రొటోకాల్ అంశాలు విధులు కేటాయించిన అధికారులు ఎలాంటి అలసత్వం లేకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని సూచించారు. తాజ్ హోటల్ సమీపంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్ద భద్రత ఏర్పాట్లను జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ సుబ్బరాయుడితో కలిసి పరిశీలించారు. అదనపు ఎస్పీలు వెంకట్రావు, రవి మనోహరాచారి, జిల్లా రెవెన్యూ అధికారి నరసింహులు, తిరుపతి, శ్రీ కాళహస్తి ఆర్డీఓలు రామ్మోహన్, భాను ప్రకాష్ రెడ్డి పాల్గొన్నారు.

స్కానర్లు దాచేశారు!


మూలన పడిన స్కానర్లు

శ్రీకాళహస్తి: శివాలయంలో జరిగే అవకతవకలు భక్తుల ఇబ్బందులను తెలిపేలా ప్రభుత్వం ప్రతి ఆలయంలో ఫ్లెక్సీల రూపంలో స్కానర్లను ఏర్పాటు చేసింది. ఆ స్కానర్లు శ్రీకాళహస్తీశ్వర ఆలయంలో కనిపించకుండా చేసేశారు. చెప్పులు స్టాండ్, మొబైల్ కౌంటర్లు, ప్రసాదం కౌంటర్లు, ఆలయం ఎంట్రెన్స్, రూములు కేటాయించే చోట, పీఆర్వో ఆఫీస్ వద్ద, తదితర ప్రాంతాల్లో ప్రభుత్వం స్కానర్లు ఫ్లెక్సీ రూపంలో భక్తుల సూచనలు, సలహాలు ఫిర్యాదుల కోసం ఏర్పాటు చేయమని సూచనలు చేసింది. ఆలయాధికారులు తూతూ మంత్రంగా స్కానర్లు ఏర్పాటు చేశారు. అయితే వాటిని కూడా ఇప్పుడు మాయం చేశారు. ఆలయంలో జరిగే దోపిడీలను భక్తులు స్కాన్ చేసి, ఫిర్యాదుల రూపంలో వెల్లువెత్తడంతోనే ఈ స్కానర్లు మాయం చేశారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. చెప్పులు స్టాండ్ వద్ద నుంచి రాహు కేతు మండపాల వరకు, ప్రతి విషయంలో జరుగుతున్న దోపిడీలు స్కానర్ ద్వారా భక్తులు ఫిర్యాదు చేస్తుండడంతో వాటిని కనిపించకుండా చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారులు స్పందించి స్కానర్లను ఏర్పాటు చేయాల్సి ఉంది.

విశ్వంలో ఘనంగా యూఎస్ఓ ఇంటర్ స్కిల్స్ ఫెస్ట్


ప్రతిభ చూపిన విద్యార్థులతో డీఈఓ, సంస్థ ప్రతినిధులు

తిరుపతి సిటీ: జీవకోనలోని విశ్వం హైస్కూల్ వేదికగా యూఎస్ఓ ఇంటర్ స్కిల్స్ ఫెస్ట్–2025 కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా విద్యాశాఖాధికారి కేవీఎస్ కుమార్ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఆధునిక టెక్నాలజీని వినియోగించుకుని, భావి భారతానికి మార్గదర్శకులుగా నిలవాలని పిలుపునిచ్చారు. తొలిసారి ఈ ఫెస్ట్‌లో జిల్లా వ్యాప్తంగా అనేక పాఠశాలల విద్యార్థులు పాల్గొని, పలు విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో ప్రతిభ చూపి బహుమతులు పొందారు. ఈ కార్యక్రమంలో విశ్వం విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఎన్ విశ్వనాథ్‌రెడ్డి, డైరెక్టర్ విశ్వచందన్‌రెడ్డి, యూఎస్ఓ వైస్ ప్రెసిడెంట్ కేవీ త్యాగరాజన్ పాల్గొన్నారు.

చెన్నై- నెల్లూరు మెమో రైలు నేడు రద్దు

నాయుడుపేటటౌన్: చెన్నై- నెల్లూరు మెమో రైలును మంగళవారం రద్దు చేసినట్లు నాయుడుపేట రైల్వే స్టేషన్ మేనేజర్ చిరంజీవి సోమవారం తెలిపారు. పలు ప్రాంతాల్లో రైల్వే లైన్ల మరమ్మతు కారణంగా మెమో రైలు రద్దు చేసినట్లు రైల్వే ఉన్నతాధికారులు ప్రకటించినట్లు ఆయన వెల్లడించారు. ఈ అసౌకర్యాన్ని రైల్వే ప్రయాణికులు తెలుసుకోవాలన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని డెలివరీ బాయ్ మృతి

శ్రీకాళహస్తి: ఆర్టీసీ బస్సు ఢీ కొనడంతో ఫుడ్ డెలివరీ బాయ్ మృతి చెందిన ఘటన శ్రీకాళహస్తి వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. పెళ్లకూరు మండలం పుల్లూరు గ్రామానికి చెందిన మునిరెడ్డి (55) శ్రీకాళహస్తిలో 12 ఏళ్లుగా నివాసం ఉంటూ ఒకవైపు వ్యవసాయం చేసుకుంటూ మరోవైపు డెలివరీ బాయ్‌గా పనిచేస్తూ జీవనం గడుపుతున్నాడు. విధుల్లో భాగంగా ఆదివారం పట్టణంలోని శ్రీరామ్‌నగర్ కాలనీలోని అమరజ్యోతి కల్యాణ మండపం ఎదురుగా రాత్రి 10.50 సమయంలో ఫుడ్ డెలివరీ ఇవ్వడానికి తన ద్విచక్ర వాహనం లో ఎస్కే ఫుడ్ రెస్టారెంట్‌కు వెళ్లడానికి రోడ్డు క్రాస్ చేసే సమయంలో గూడూరు నుంచి తిరుపతికి వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీ కొంది. ఈ ప్రమాదంలో మునిరెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు డాక్టర్లు వెల్లడించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

అర్ధరాత్రి సీహెచ్‌ఓల నిరసన

– అక్రమ బదిలీలను ఆపాలంటూ ఆందోళన


డీఎంహెచ్ఓ కార్యాలయం వద్ద మహిళా సీహెచ్‌ఓల నిరసన

తిరుపతి తుడా: తిరుపతి జిల్లా ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో పనిచేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల అక్రమ బదిలీలను ఆపాలంటూ అర్ధరాత్రి ఆందోళనకు దిగారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయం వద్ద కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి 9 గంటల నుంచి నిరసన కార్యక్రమాన్ని కొనసాగించారు. కుప్పంలో నిర్వహిస్తున్న ఇంటిగ్రేటెడ్ హెల్త్ కేర్ డెలివరీ కోసం టాటాస్ డిజిటల్ నర్వ్ సెంటర్‌లో శిక్షణ కోసం ఐదుగురు మహిళా కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లను రెండు వారాల క్రితం పంపించారు. శిక్షణ పూర్తిచేసుకున్న మహిళ సీహెచ్‌ఓలు నారావారిపల్లెలో నూతనంగా ఏర్పాటుచేస్తున్న ఇంటిగ్రేటెడ్ హెల్త్ కేర్ డెలివరీలో పనిచేయాలని ముందుగా ఆదేశాలిచ్చారు. అయితే శిక్షణ పూర్తిచేసుకున్న ఐదుగురు మహిళా సీహెచ్‌ఓల్లో ముగ్గురిని కుప్పంలోనే ఉండాలని ఆదేశాలు ఇవ్వడంతో అసోసియేషన్ నాయకులు తీవ్రంగా వ్యతిరేకించారు. మహిళా సీహెచ్‌ఓలను తిరుపతి జిల్లా నుంచి పంపించాల్సిన అవసరం ఏముందని ఆ అసోసియేషన్ స్టేట్ సెక్రటరీ సందీప్ కుమార్ నిలదీశారు. చిత్తూరు జిల్లాలో కుప్పానికి సమీపంలో ఉన్న సీహెచ్‌ఓలను పంపించే అవకాశం ఉన్నా తిరుపతి జిల్లా నుంచి పంపించడం సరైన కాదని ఆయన పేర్కొన్నారు. మహిళా సీహెచ్‌ఓలపై కక్ష సాధింపు చర్యలతోనే జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి బలవంతంగా బదిలీలకు పూనుకున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ అక్రమ బదిలీలను వెంటనే రద్దు చేయాలని, లేని పక్షంలో రాష్ట్రవ్యాప్త ఉద్యమం తప్పదని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమానికి సీఐటీయు జిల్లా కార్యదర్శి జయచంద్ర, జేఏసీ చైర్మన్ గండికోట నాగ వెంకటేష్ తదితరులు మద్దతు ఇచ్చారు.

ఆస్పత్రికి వెళుతూ తిరిగిరాని లోకాలకు..


మునెమ్మ మృతదేహం


మునెమ్మ(ఫైల్)


బాలాజీ మృతదేహం


బాలాజి(ఫైల్)

- రోడ్డు ప్రమాదంలో తల్లీకొడుకుల మృతి

నారాయణవనం: వైద్య పరీక్షల కోసం పుత్తూరుకు వెళుతూ రోడ్డు ప్రమాదానికి గురై నింద్ర మండలం ఐఆర్ కండ్రిగ గ్రామానికి చెందిన తల్లీకొడుకులు మునెమ్మ(47), బాలాజీ(28) మృతి చెందారు. ఈ సంఘటన నారాయణవనం బైపాస్‌లోని జ్యూస్ ఫ్యాక్టరీ సమీపంలో సోమవారం ఉదయం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. నింద్ర మండలం ఐఆర్ కండ్రిగకు చెందిన కేశవులు భార్య మునెమ్మ అనారోగ్యంతో బాధపడుతోంది. సోమవారం ఉదయం కుమారుడు బాలాజీతో మోటార్ సైకిల్‌పై తిరుపతిలో ఆస్పత్రికి బయలుదేరారు. నారాయణవనంలో 716–ఎ జాతీయ రహదారి బైపాస్‌లోని జ్యూస్ ఫ్యాక్టరీ వద్దకు చేరుకున్నారు. రహదారిలో గుంటను తప్పించడానికి మోటార్‌సైకిల్‌ను కుడివైపునకు నడిపాడు. అదే సమయంలో చెన్నై వైపు వెళుతున్న కారును ఢీకొనడంతో మునెమ్మ, బాలాజీ అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ప్రమాదంలో మోటార్ సైకిల్, కారు ముందు భాగం పూర్తిగా ధ్వంసమైంది. సమాచారం అందుకున్న పోలీసులు మృత దేహాలను పుత్తూరు ప్రభుత్వాస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కేశవులు ఫిర్యాదు మేరకు కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ గోపి తెలిపారు.

సంఘమిత్ర చేతివాటం

– రూ.11 లక్షలు స్వాహా

తిరుపతి రూరల్: మండలంలోని కుంట్రపాకం పంచాయతీలో సంఘమిత్ర డ్వాక్రా డబ్బులు రూ.11 లక్షలు స్వాహా చేసిన సంఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. తిరుపతి రూరల్ మండలం కుంట్రపాకం పంచాయతీలో సంఘమిత్రగా పనిచేస్తున్న చెంచులక్ష్మి, అదే పంచాయతీ పరిధిలో నివాసముంటున్న ఎస్టీలకు చెందిన మూడు పొదుపు సంఘాల డబ్బులను స్వాహా చేసినట్లు ఫిర్యాదులు రావడంతో అధికారులు లెక్కలు తనిఖీ చేశారు. రూ.11 లక్షల వరకు స్వాహా చేసినట్లుగా నిర్ధారించుకున్న తరువాత సంఘమిత్ర చెంచులక్ష్మిని విచారించారు. చాలా వరకు గ్రూపు సభ్యుల నుంచి కూడా డబ్బులు రావాల్సి ఉండడంతో సంఘమిత్ర వాడుకున్న డబ్బుతోపాటు బకాయి పడిన సభ్యులందరితో వసూలు చేసి, ఆ మొత్తాన్ని జమ చేయాలని ఆదేశించారు. దీనిపై ఏపీఎం నాగేశ్వరరావును వివరణ కోరగా రూ.15 లక్షలు కాదని, ఆ సంఘమిత్ర పరిధిలోని గ్రూపుల లెక్కలు తనిఖీ చేయగా రూ.11 లక్షలు తేడా వచ్చిందన్నారు. ఇంకా బ్యాంకు ఖాతాలను తనిఖీ చేయాల్సి ఉందని, ఆ తరువాత పూర్తి సమాచారం ఇస్తామని చెప్పారు. సంఘమిత్ర ఆస్పత్రి లో ఉందని ఆమె వచ్చిన తరువాత వాడుకున్న డబ్బులు తిరిగి చెల్లిస్తానని అంగీకరించారని తెలిపారు.

ప్రతి భక్తుడికీ బస్సు సౌకర్యం

- తిరుపతి, చిత్తూరు డీఎంలతో ఆర్టీసీ ఈడీ సమీక్ష


సమావేశంలో మాట్లాడుతున్న ఈడీలు చంద్రశేఖర్, చెంగల్‌రెడ్డి, డీపీటీవో జగదీష్

తిరుపతి అర్బన్: తిరుమల బ్రహ్మోత్సవాల్లో ప్రతి భక్తుడికి ఆర్టీసీ సర్వీసులను అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఈడీ ఆపరేషన్స్) చంద్రశేఖర్ పేర్కొన్నారు. తిరుపతిలోని డీపీటీవో కార్యాలయంలో సోమవారం తిరుపతి, చిత్తూరు జిల్లాలకు చెందిన ఆర్టీసీ డీఎంలు, అసిస్టెంట్ డీఎంలు, సూపర్‌వైజర్లు, మెకానిక్స్‌తో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బుధవారం నుంచి అక్టోబర్ 2 వరకు ప్రతి రోజు 2వేల ట్రిప్పులను తిప్పడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ఆ మేరకు రోజుకు 1,20,000 మంది ప్రయాణికులను క్షేమంగా గమ్యం చేర్చడానికి చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు. గరుడ సేవ రోజు మాత్రం 3,125 ట్రిప్పులను తిప్పడానికి ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. దాంతో ఆ రోజు 2,30,000 మంది భక్తులకు ఆర్టీసీ బస్సులు అందుబాటులో ఉంటాయని చెప్పారు. విజయవాడ నుంచి విచ్చేసిన ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్(ఈడీ ఇంజనీరింగ్) చెంగల్‌రెడ్డి మాట్లాడుతూ తిరుపతి బస్టాండ్‌లో మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. ప్రయాణికులతో గౌరవంగా మెలగాలని వెల్లడించారు. ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటించాలని, మద్యం సేవించి, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. అనంతరం డీపీటీవో జగదీష్ మాట్లాడుతూ తిరుపతి నుంచి తిరుమలకు వెళ్లే మార్గంలో 1, 6, 8, 11వ కిలోమీటర్ రాయి సమీపంలోని మలుపులు, వచ్చే మార్గంలో 1, 2, 3, 7, 12, 30, 38, 58వ కిలోమీటర్ రాయి సమీపంలోని మలుపులు ఎంతో ప్రమాదకరంగా గుర్తించామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ విశ్వనాథం డిప్యూటీ చీఫ్ మెకానిక్ ఇంజనీర్ బాలాజీ, డీఎంలు, అసిస్టెంట్ డీఎంలు, సూపర్‌వైజర్లు, మెకానిక్స్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

క్షతగాత్రుడికి పరామర్శ



జగదీష్‌ను పరామర్శిస్తున్న మోహిత్‌రెడ్డి

తిరుపతి రూరల్ : మండలంలోని పెరుమాళ్లపల్లెకు చెందిన జగదీష్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి కరకంబాడి వద్ద అమరా ఆస్పత్రిలో చికిత్సపొందుతున్నాడు. సోమవారం ఈ మేరకు వైఎస్సార్‌సీపీ చంద్రగిరి నియోజకవర్గ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఆస్పత్రికి వెళ్లి జగదీష్‌ను పరామర్శించారు. ఆరోగ్యస్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లకు సూచించారు. పార్టీ మండల అధ్యక్షుడు మునీశ్వర రెడ్డి పాల్గొన్నారు.

హక్కుల సాధనకు ఉద్యమం



మాట్లాడుతున్న కేసన శంకరరావు

తిరుపతి కల్చరల్ : బీసీల హక్కుల సాధనే లక్ష్యంగా ఉద్యమించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు పిలుపు నిచ్చారు. సోమవారం నగరంలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో బీసీ సంఘం జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టం తీసుకువస్తామని, చట్టసభల్లో బీసీ మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు, 50 ఏళ్లు దాటిన బీసీలకు పింఛన్ మంజూరు చేస్తామని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమగ్ర కులగణన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని కోరారు. బీసీ సంఘం నేతలు కల్లూరి నాగరాజగౌడ్, బాదుగున్నల శ్రీనివాస్, ఆర్‌కే.యాదవ్, లోకనాథం, సోమశేఖర్, మధు ఆచారి, వాసు పాల్గొన్నారు.

జీఎస్టీ రద్దుపై హర్షం



కేక్ కట్ చేస్తున్న ఎల్ఐసీ అధికారులు, ఏజెంట్లు

తిరుపతి ఎడ్యుకేషన్ : జీవిత బీమా పాలసీలపై జీఎస్టీని కేంద్ర ప్రభుత్వం రద్దు చేయడంపై ఎల్ఐసీ అధికారులు, ఏజెంట్లు హర్షం వ్యక్తం చేశారు. సోమవారం తిరుపతిలోని ఎల్ఐసీ రెండో బ్రాంచ్‌లో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఇకపై ఎల్ఐసీ ప్రీమియం, కొత్త పాలసీలకు జీఎస్టీ ఉండదని వెల్లడించారు.

40 మంది రక్తదానం



రక్తదానం చేస్తున్న విద్యార్థినులు

తిరుపతి రూరల్ : పద్మావతి మహిళా వర్సిటీలో సోమవారం నిర్వహించిన శిబిరంలో 40 మంది ఎన్ఎస్ఎస్ విద్యార్థినులు రక్తదానం చేశారు. వర్సిటీ వైద్యాధికారి పద్మావతి మాట్లాడుతూ ప్రతి రక్తపు చుక్క అమూల్యమైందన్నారు. రక్తదాతలను అభినందించారు. ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ ప్రొఫెసర్ లలిత కుమారి, స్విమ్స్ వైద్యులు ప్రవీణ్, జయశ్రీ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ధర్నా

చంద్రగిరి : వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సోమవారం చంద్రగిరి తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీరాములు, రాజా మాట్లాడుతూ వీఆర్‌ఏలను ప్రభుత్వం పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. గుర్తింపు కార్డులు, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. వేతనాలను పెంచాలని కోరారు. రెవెన్యూశాఖలోని ఖాళీ పోస్టుల భర్తీలో వీఆర్‌ఏలకు 70శాతం ప్రాధాన్యమివ్వాలని స్పష్టం చేశారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. కోటి, శేషాద్రి, రామ్మూర్తి, వరప్రసాద్, పార్వతి, శ్రీదేవి, మధు, బాలసుబ్రమణ్యం, అనిల్ పాల్గొన్నారు.

సమష్టిగా విధుల నిర్వహణ



మాట్లాడుతున్న ఎస్పీ సుబ్బరాయుడు

తిరుమల: శ్రీవారి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేసేందుకు పోలీసులు సమష్టిగా విధులు నిర్వర్తించాలని అనంతపురం రేంజ్ డీఐజీ షేముషి ఆదేశించారు. సోమవారం తిరుమలలోని పోలీస్ కంట్రోల్ రూమ్‌లో బ్రహ్మోత్సవాల భద్రతపై సమీక్షించారు. డీఐజీ మాట్లాడుతూ క్రౌడ్ మేనేజ్‌మెంట్, ట్రాఫిక్ నియంత్రణపై దష్టి పెట్టాలన్నారు. భక్తులతో ఓర్పుగా సహనంగా మెలగాలని సూచించారు. ఎస్పీ సుబ్బరాయుడు మాట్లాడుతూ అత్యంత అప్రమత్తంగా విధులు నిర్వహించాలన్నారు. తిరుమల పవిత్రతకు భంగం వాటిల్లితే సహించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. అలసత్వం చూపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సీవీఎస్ఓ మురళీకృష్ణ మాట్లాడుతూ టీటీడీ విజిలెన్స్ సిబ్బంది, పోలీస్ శాఖతో సమన్వయం చేసుకుంటూ విధులు నిర్వర్తించాలని కోరారు.

చినుకు.. నగరం చిగురుటాకు

లీలామహల్ సర్కిల్ వద్ద రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షపు నీరు (ఫైల్)



చిన్నపాటి వర్షానికే తిరునగరం చిగురుటాకులా వణికిపోతోంది. చిరుజల్లులకే అతలాకుతలమవుతోంది. అదే ఓ గంటపాటు జోరుగా వాన కురిస్తే జనజీవనం అస్తవ్యస్తంగా మారుతోంది. రహదారులు చెరువులను తలపించే దుస్థితి దాపురిస్తోంది. వాహనదారుల రాకపోకలకు తీవ్రమైన ఆటంకం ఎదురవుతోంది. ప్రధానంగా లోతట్టు ప్రాంతాల్లో ఇళ్లలోకి నీరు చేరుతోంది. రోడ్లపైకి మురుగు పేరుకుపోతోంది. రైల్వే అండర్ బ్రిడ్జిల వద్ద పరిస్థితి మరింత ప్రమాదకరంగా తయారవుతోంది. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ర్యాంకులు సాధిస్తున్నప్పటికీ చినుకు పడితే ఆధ్యాత్మిక క్షేత్రం అధ్వాన్నంగా మారుతోంది. స్మార్ట్‌సిటీ పేరిట అభివృద్ధి పనులకు రూ.కోట్లు వెచ్చిస్తున్నప్పటికీ సమస్య పరిష్కారంలో కార్పొరేషన్ యంత్రాంగం విఫలమవుతోంది.

- చిరు జల్లులకే అతలాకుతలమవుతున్న తిరుపతి
- జలమయంగా మారుతున్న లోతట్టు ప్రాంతాలు
- కాలువల ఆక్రమణలతో నగరం దాటని వర్షపునీరు
- రైల్వే అండర్ బ్రిడ్జిల వద్ద ప్రమాదకర పరిస్థితులు
- గత అనుభవాలను పట్టించుకోని అధికారులు

తిరుపతి తుడా : ఆధ్యాత్మిక క్షేత్రం చిన్నపాటి వర్షానికే జలమయంగా మారుతోంది. ఇక భారీ వర్షాలు పడితే జలదిగ్బంధంలో చిక్కుకుంటోంది. వారం క్రితం రెండు గంటల పాటు కుండ పోత వర్షం పడింది. దీంతో లోతట్టు ప్రాంతాలంతా నీట మునిగాయి. రైల్వే అండర్ బ్రిడ్జిల కింద చెత్తాచెదారాలతోపాటు నీరు నిల్వ చేరింది. ఈ క్రమంలోనే గురువారం మధ్యాహ్నం గంటపాటు పడిన చిరుజల్లులకే రోడ్లపై నీరు ఏరులై ప్రవహించింది. తరచూ ఇలాంటి ఘటనలు ఎదురవుతున్నా అధికారులు మాత్రం తాత్కాలిక చర్యలతో చేతులు దులుపుకుంటున్నారు. ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపలేకపోతున్నారు.

వెళ్లని వర్షపు నీరు

వర్షపు నీరు నగరం దాటడం లేదు. చిన్నపాటి వర్షం కురిసినా కాలువలు పొంగి మురుగు రోడ్లపైకి చేరుతోంది. కాస్త ఎక్కువ వర్షం పడితే ఇక అస్తవ్యస్తమే. ఎగువ ప్రాంతాల నుంచి ప్రవహించే వర్షపు నీరు ఎక్కడికక్కడ నిలిచిపోతోంది. దీంతో వాహనదారులు, చిరు వ్యాపారులకు తిప్పలు తప్పడం లేదు. ఆదమరిస్తే వర్షపునీరు ఇళ్లల్లోకి చేరి వస్తువులు దెబ్బతింటున్నాయి. మూడేళ్ల క్రితం లీలామహల్ కూడలి, లక్ష్మీపురం సర్కిల్ ప్రాంతాల్లో చేపట్టిన కాలువల విస్తరణ కొంతవరకు ఉపశమనం కలిగించింది. మిగిలిన ప్రాంతాలపై దృష్టి సారించకపోవడంతో పరిస్థితి మళ్లీ మొదటికే వచ్చింది.

ఆక్రమణలతోనే అసలు సమస్య

నగరంలో పెద్ద కాలువలు ఆక్రమణకు గురయ్యాయి. దీంతో వర్షం కురిస్తే కాలువలు పొంగి ప్రవహిస్తున్నాయి. శేషాచలం అడవుల నుంచి కిందకు వచ్చే వర్షపు నీరు నగరంలోని పలు ప్రాంతాలను ముంచెత్తుతోంది. ప్రధానంగా మూడు పెద్ద కాలువలు మీదుగా వర్షపు నీరు నగరం దాటి స్వర్ణముఖి నదిలో కలుస్తుంటుంది. కపిలతీర్థం నీరు శివజ్యోతినగర్ మీదుగా వినాయక సాగర్‌కు చేరుతుంది. మాల్వాడి గుండం నీరు ఎన్జీఓ కాలనీ, భవానీనగర్, కొర్లగుంట మీదుగా నగరం దాటుతుంది. పడమటి ప్రాంతాల నుంచి వచ్చే వర్షపు నీరు పద్మావతి కళాశాల, ఎస్వీ నగర్, ఎమ్మార్‌పల్లె, కేశవయనగుంట మీదుగా ప్రవహిస్తుంది. ఈ కాలువలు ప్రారంభ దశలో 20 నుండి 30 అడుగుల మేర ఉండగా నగరంలోకి వచ్చేసరికి 5 అడుగుల వెడల్పుకు కుంచించుకుపోయాయి. కాలువలు ఇరువైపులా ఆక్రమణలకు గురయ్యాయి. దీంతో నగరంలో చిన్నపాటి వర్షం పడిన కాలువలు పొంగి ప్రవహిస్తున్నాయి. దీంతో లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లలోకి, కాలువలు కంటే తక్కువ ఎత్తులో ఉన్న రోడ్ల పైకి నీరు చేరుతోంది. ఏటా వర్షాకాలంలో ఈ సమస్య ఎదురవుతున్నప్పటికీ అధికారులు నిర్లక్ష్యంగానే వ్యవహరిస్తున్నారు. ముంపు వచ్చినప్పుడు హంగామా చేసి, తర్వాత వదిలేస్తున్నారు. 2017, 2022లో తుపాను బీభత్సానికి నగరం ముంపునకు గురైంది. అయినప్పటికీ అధికారులు గత అనుభవాల నుంచి పాఠం నేర్చుకోకపోవడం గమనార్హం. ఈ క్రమంలో కాలువల ఆక్రమణలను తొలగించి, వెడల్పు చేస్తే కానీ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించదని పలువురు సూచిస్తున్నారు.



కొర్లగుంటలో కుంచించుకుపోయిన కాలువ



రాయలచెరువు రోడ్డు అండర్ బ్రిడ్జి వద్ద వరద నీరు (ఫైల్)



కొరమేనుగుంటలో ఇళ్ల వద్దకు చేరిన నీరు (ఫైల్)

సమన్వయంతో మరింత బలోపేతం

తిరుపతి మంగళం : నేతలు, కార్యకర్తలతో సమన్వయం చేసుకుంటూ వైఎస్సార్‌సీపీని మరింత బలోపేతం చేయాలని పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి తెలిపారు. సోమవారం పద్మావతిపురంలోని కార్యాలయంలో పార్టీ నగర అధ్యక్షుడు మల్లం రవిచంద్రారెడ్డి, నేతలు సయ్యద్ షఫీ అహ్మద్‌ఖాదరీ, సాకం ప్రభాకర్, నవీన్‌కుమార్‌తో సమవేశం నిర్వహించారు. ప్రభుత్వ వ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు ఇటీవల చేపట్టిన కొన్ని కార్యక్రమాలను అందరికీ సమాచారం అందించలేకపోయామని అభినయ్ వెల్లడించారు. తప్పని పరిస్థితుల్లో చేయాల్సి వచ్చిందని, మమ్మల్ని ఆహ్వానించలేదని ఎవరూ తప్పుగా భావించవద్దని కోరారు. పార్టీలో సీనియర్లకు ఎప్పుడూ పెద్దపీట ఉంటుందని వివరించారు.



మాట్లాడుతున్న భూమన అభినయ్‌రెడ్డి

జీఓ1793 రద్దుకు డిమాండ్

తిరుపతి కల్చరల్ : దొమ్మర కులస్తులను బలిజల్లో కలుపుతూ ప్రభుత్వం తీసుకువచ్చిన జీఓ నంబర్ 1793ని తక్షణమే రద్దు చేయాలని బలిజ సేన నేతలు డిమాండ్ చేశారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో బలిజ సేన రాష్ట్ర అధ్యక్షుడు ఆర్కాట్ కృష్ణప్రసాద్, ప్రధాన కార్యదర్శి బెల్లం కొండ సురేష్ మాట్లాడా రు. బలిజల ఓట్లు పొందిన పాలకులు ఇప్పుడు అణచివేతకు గురిచేస్తున్నారని విమర్శించారు. దొమ్మర సామాజికవర్గంపై ఎలాంటి వ్యతిరేకత లేదని వారికి మరో గౌరవప్రదమైన అవకాశం కల్పించాలని కోరారు. నేతలు రామారావు, సురేష్, వాసు, కేఆర్.సుబ్రమణ్యం, కోకిల, శిరీష పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్కాట్ కృష్ణప్రసాద్

కబ్జాకోరులతో జాగ్రత్త

తిరుపతి మంగళం : నగరంలో ఖాళీ స్థలాలు ఉన్నవారు కబ్జాకోరులతో జాగ్రత్తగా ఉండాలని తిరుపతి టౌన్‌బ్యాంక్ వైస్ చైర్మన్ వాసుయాదవ్ హెచ్చరించారు. సోమవారం పద్మావతిపురంలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. నగరంలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కుమారులు, అనుచరుల భూకబ్జాలు అన్నీ ఇన్నీ కావన్నారు. భూములు ఖాళీగా కనిపిస్తే కబ్జాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. జనసేన, టీడీపీ నేతలు విచ్చలవిడిగా భూములను ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని మండిపడ్డారు. ఇటీవల శివజ్యోతినగర్‌లో ఎమ్మెల్యే పీఏ ప్రభుత్వ భూమిని ఆక్రమించుకుని ఇల్లు నిర్మిస్తుంటే తాము అడ్డుకున్నామన్నారు. కలెక్టర్ స్పందించి అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని లేకుంటే ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు.

యాప్‌తో లెక్కలు పారదర్శకం

తిరుపతి రూరల్: ఎండీఎంఎల్ యాప్‌తో లెక్కలు పారదర్శకంగా ఉంటాయని డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు అన్నారు. తిరుపతి రూరల్ మండలంలోని ఐదు గ్రామ సమాఖ్యలను పైలట్-1 ప్రాజెక్టుగా 'మన డబ్బులు – మన లెక్కలు' పథకానికి ఎంపిక చేశారు. అందులో భాగంగా తనపల్లి గ్రామ సమాఖ్య సభ్యులకు సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ డ్వాక్రా సంఘాల నగదుకు భద్రత కల్పించేందుకు ప్రభుత్వం ఎండీఎంఎల్ యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చిందని చెప్పారు. ఈ యాప్‌తో ప్రతి సభ్యురాలి సమాచారం, పొదుపు, అప్పు వివరాలు, సంఘం సభ్యులు చేసే ఉత్పత్తులు, సేవలు నమోదు చేసుకోవచ్చన్నారు. సంఘం పూర్తి సమాచారం అందులోనే ఉంటుందని వెల్లడించారు.

సరస్వతిబాయికి డాక్టరేట్

తిరుపతి రూరల్ : పద్మావతి మహిళా వర్సిటీ పరిశోధక విద్యార్థిని వడిత్యా సరస్వతిబాయికి డాక్టరేట్ ప్రదానం చేశారు. ప్రొఫెసర్ టి.సుధా మార్గదర్శకత్వంతో ఏఐ-ఆధారిత క్లౌడ్ ఫోరెన్సిక్ సెక్యూరిటీ మోడల్ యూజింగ్ డీప్ లెర్నింగ్ ఫర్ ఇంట్రూషన్ ఐడెంటిఫికేషన్ అండ్ ఎవిడెన్షియరీ ప్రిజర్వేషన్ అనే అంశంపై ఆమె పరిశోధన పత్రాలు సమర్పించారు.



గ్రీవెన్స్‌కు 37 వినతులు

తిరుపతి తుడా : కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (గ్రీవెన్స్)కు 37 వినతులు వచ్చినట్లు కమిషనర్ మౌర్య తెలిపారు. 31 మంది నేరుగా వచ్చి సమస్యల పరిష్కారం కోరుతూ వినతులు అందించగా, ఆరుగురు ఫోన్ ద్వారా సమస్యలు తెలిపినట్లు వెల్లడించారు. ఈ క్రమంలోనే వైఎస్సార్‌సీపీ గ్రీవెన్స్ సెల్ ఆధ్వర్యంలో నగరంలోని పలు సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం డిప్యూటీ కమిషనర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఎస్ఈ శ్యామ్‌సుందర్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ పాల్గొన్నారు.



డిప్యూటీ కమిషనర్‌కు వినతి పత్రం అందిస్తున్న శేఖర్ రాయల్ తదితరులు

మెరుగైన పారిశుద్ధ్యమే లక్ష్యం

తిరుపతి తుడా : శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా నగరంలో మెరుగైన పారిశుద్ధ్యమే లక్ష్యంగా విధులు నిర్వర్తించాలని కార్పొరేషన్ కమిషనర్ మౌర్య ఆదేశించారు. సోమవారం రైల్వే స్టేషన్, ఆర్టీసీ బస్టాండ్, విష్ణు నివాసం వసతి సముదాయం ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. భక్తుల రద్దీ ఉండే ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను మరింత మెరుగ్గా చేపట్టాలని సూచించారు. దెబ్బతిన్న ఫుట్‌పాత్‌లకు మరమ్మతు చేయించి, పూల కుండీలు ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే రోడ్లపూవ గుంతలను పూడ్చాలని చెప్పారు. మరుగుదొడ్లు శుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. ఎస్ఈ శ్యామ్‌సుందర్, ఎంఈ తులసి కుమార్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవెన్యూ ఆఫీసర్లు, ఏసీపీలు మధు, మూర్తి, డీఈలు లలిత, రాజు, శానిటరీ సూపర్ వైజర్ సుమతి పాల్గొన్నారు.



సూచనలిస్తున్న కమిషనర్ మౌర్య

ముగిసిన ధ్యాన మహాయజ్ఞం

తిరుపతి కల్చరల్ : మహతి కళాక్షేత్రంలో వారం రోజులుగా నిర్వహిస్తున్న ధ్యాన మహాయజ్ఞం సోమవారం సాయంత్రంతో విజయవంతంగా ముగిసింది. మహాయజ్ఞంలో భాగస్వాములైనవారికి పీఎంసీ ట్రస్ట్ చైర్మన్ హనుమంతరాజు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా విద్వాన్ సుధాంశు కట్టి బృందం ప్రదర్శించిన సామూహిక అఖండ సంగీత నాద ధ్యానం ఆకట్టుకుంది. అనంతరం సీనియర్ పిరమిడ్ మాస్టర్లు, ధ్యాన గురువులు, పీఎంసీ డైరెక్టర్లు, ట్రస్టీలు, ఉద్యోగులను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. పీఎంసీ మేనేజింగ్ డైరెక్టర్ ఆనంద్‌కుమార్, దుర్గారాని, మాధవి, శేషారత్నం, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



అతిథులను సత్కరిస్తున్న నిర్వాహకులు

ఉద్యోగోన్నతులపై కృతజ్ఞతలు

తిరుపతి రూరల్ : ఎస్పీడీసీఎల్ డిస్కమ్ పరిధిలో ఉద్యోగోన్నతులు కల్పించినందుకు ప్రమోషన్ పొందిన అధికారులు సోమవారం సీఎండీ సంతోషరావుకు కృతజ్ఞతలు తెలిపారు. విద్యుత్ అధికారుల సంఘం నేతలు పుల్లా బాలాజీ, డి.నాగరాజు, వి.రమేష్, కె.జయప్రకాష్, మునిప్రసాద్, స్వాతి, లక్ష్మి పాల్గొన్నారు.



సీఎండీకి కృతజ్ఞతలు తెలుపుతున్న అధికారులు

టీటీడీ చైర్మన్ వ్యాఖ్యలు అనుచితం



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

తిరుపతి మంగళం : టీటీడీ బోర్డు చైర్మన్ బీఆర్ నాయుడు వ్యాఖ్యలు అనుచితమని, వీధి రౌడీలా మాట్లాడుతూ మాజీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డిని దూషిస్తున్నారని వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు మండిపడ్డారు. సోమవారం ఈ మేరకు పార్టీ నగర అధ్యక్షుడు మల్లం రవిచంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఈస్ట్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అలాగే యువజన విభాగం ఆధ్వర్యంలో అలిపిరి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రవిచంద్రారెడ్డి మాట్లాడుతూ భూమన కరుణాకరరెడ్డి రెండుసార్లు టీటీడీ చైర్మన్‌గా, మూడుసార్లు బోర్డు సభ్యుడిగా విధులు నిర్వర్తించారని, ఎప్పుడూ ఎవరినీ అసభ్య పదజాలాలతో దూషించలేదని, రాజకీయాలు మాట్లాడలేదని స్పష్టం చేశారు. అయితే ప్రస్తుతం టీటీడీలో జరుగుతున్న అపచారాలను ఎత్తిచూపినందుకు కరుణాకరరెడ్డిని నోటికి వచ్చినట్లు బీఆర్ నాయుడు దూషించడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. పైగా కరుణాకరరెడ్డిపై తప్పుడు కేసులు పెట్టారని మండిపడ్డారు. వెంటనే బీఆర్ నాయకుడిపై కేసు నమోదు చేయాలని పోలీసులను కోరారు. కార్పొరేటర్లు కోటూరు ఆంజనేయులు, ఆదిలక్ష్మి, నేతలు అజయ్‌కుమార్, వాసుయాదవ్, సాకం ప్రభాకర్, నల్లాని బాబు, తలారి రాజేంద్ర, గీతాయాదవ్, మల్లం రవికుమార్, మద్దాలి శేఖర్, వెంకటేష్, రావూరి ప్రసాద్, ముప్పాల సాయికుమారి, దినేష్ రాయల్, పసుపులేటి సురేష్, నవీన్, కోటి, ఆటో ప్రసాద్, స్వరూప్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌టీయూసీని బలోపేతం చేస్తాం



రాజారెడ్డి

తిరుపతి కల్చరల్ : వైఎస్సార్ టీయూసీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తామని జోనల్ ఇన్‌చార్జి నారపరెడ్డి రాజారెడ్డి తెలిపారు. రెండోసారి జోనల్ ఇన్‌చార్జిగా అవకాశం కల్పించిన పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, చిత్తూరు, తిరుపతి జిల్లాల అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి, నియోజకవర్గం ఇన్‌చార్జి భూమన అభినయరెడ్డి, వైఎస్ఆర్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు పి.గౌతమ్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

వ్యక్తిత్వ వికాసంపై శిక్షణ

చంద్రగిరి : ఎస్వీ వ్యవ సాయ కళాశాల విద్యార్థులకు కమ్యూనికేషన్ స్కిల్స్, వ్యక్తిత్వ వికాసంపై వారం రోజుల శిక్షణ తరగతులను సోమవారం ప్రారంభించారు. అసోసియేట్ డీన్ రెడ్డి శేఖర్ మాట్లాడుతూ ప్రస్తుత ఉద్యోగ అవకాశాలు పొందేందుకు కమ్యూనికేషన్ స్కిల్స్, వ్యక్తిత్వం అవసరమని తెలిపారు. కళాశాల ప్లేస్‌మెంట్ సెల్ ఇన్‌చార్జి సుబ్రమణ్యం, హరిప్రసాద్ పాల్గొన్నారు.

'ఈఎస్ఐ' అభివద్ధి కమిటీ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

తిరుపతి తుడా : ఆర్‌సీ రోడ్డులోని ఈఎస్ఐ ఆస్పత్రిలో సోమవారం మెడికల్ సూపరింటెండెంట్, శ్యాంబాబు అధ్యక్షతన హాస్పిటల్ అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. పలు వైద్య పరికరాల కొనుగోలుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపించాలని నిర్ణయించారు. ఆర్‌ఎంఓ ప్రసాద్, బ్రాంచ్ మేనేజర్ సి.నాగమణి, సెక్రటరీ ఓ. రాధమ్మ, కమిటీ సభ్యులు జి. శ్రీనివాస రావు, బ్లిస్.రవిశంకర్ రెడ్డి, సిటీ కేబుల్ రామచంద్రారెడ్డి, పి.రామ్మోహన్, ఎన్.మోహన్, సీనియర్ అసిస్టెంట్ శ్రీధర్ పాల్గొన్నారు.

చోరీ కేసులో ఐదుగురికి జైలు

పాకాల: చోరీ కేసులో ఐదుగురికి జైలుశిక్ష, జరిమానా విధిస్తూ పాకాల కోర్టు న్యాయమూర్తి పూర్ణిమాదేవి తీర్పు ఇచ్చారు. పులిచెర్ల మండలం కల్లూరులోని ఓ నగల దుకాణంలో 2019వ సంవత్సరంలో ఒకటిన్నర కిలో బంగారం దొంగలించారని బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పులిచెర్ల మండలం చింతలవారిపల్లెకు చెందిన అరుణ, గీత, ప్రభావతి, విజయకుమారి, మణి చోరీ చేసినట్టు రుజువు కావడంతో వీరికి 6 నెలల జైలుశిక్ష, ఒక్కొక్కరికి రూ.500 జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

పేరూరులో క్యాన్సర్ స్క్రీనింగ్

తిరుపతి రూరల్ : స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్‌లో భాగంగా సోమవారం పేరూరులో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ జయంతి మాట్లాడుతూ క్యాన్సర్ లక్షణాలపై అవగాహన కల్పించారు. ఎంపీపీ మూలం చంద్రమోహన్‌రెడ్డి, వైద్యులు కె.నాగరాజ్, టీటీడీ ప్రత్యూష, ఎం.లలిత్, సాయి హరిణి, చైతన్య భాను, ఎంపీహెచ్ఈఓ మురళి తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవ సంరంభం







తుమ్మలగుంటలోని శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధమైంది. ఆలయం విద్యుద్దీపాల కాంతులీనుతోంది. తొమ్మిదిరోజులపాటు వైభవంగా కొనసాగనున్న ఉత్సవాలకు చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి నేతృత్వంలో పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. అధిక సంఖ్యలో తరలిరానున్న భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వసతులు కల్పించారు. ఈ మేరకు మంగళవారం సాయంత్రం ఉత్సవాలకు అంకురార్పణ నిర్వహించనున్నారు. అనంతరం శ్రీవారి సేనాధిపతి విష్వక్సేనుల వారి ఊరేగింపు చేపట్టనున్నారు.

– తిరుపతి రూరల్